సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 1 । జూన్ । 2024



రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: విజయవాడ దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి ఎస్.గుల్షన్ కుటుంబికులు (కాకినాడ వెంకట్ నగర్) శుక్రవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



వేటాడిన మృత్యువు

ఆలమూరు - మండపేట రోడ్డులో మోదుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో.. పొట్టకూటి కోసం చేపల వేటకు వెళ్తున్న ఇద్దరు మత్స్యకారులు దుర్మరణం పాలయ్యారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
42.0° / 29.8°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	42.0	29.0
కాకినాడ	38.5	29.8
అమలాపురం	41.0	29.0

న్యూస్‌రీల్

డెల్టాలకు నేటి నుంచి నీటి విడుదల



తూర్పు డెల్టా కాలువ (ఫైల్)

ధవళేశ్వరం: సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం నుంచి ఖరీఫ్ సాగుకు నీటిని విడుదల చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఖరీఫ్ సాగుకు నీరు విడుదల చేసేందుకు ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఖరీఫ్‌లో తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాలువల పరిధిలోని 10,13,161 ఎకరాలకు నీటిని విడుదల చేయనున్నారు. తూర్పు డెల్టాలో 2,81,303, మధ్య డెల్టాలో 2,01,896, పశ్చిమ డెల్టాలో 5,29,962 ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. బ్యారేజీ వద్ద శుక్రవారం సాయంత్రం నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది. సముద్రంలోకి 3,195 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

జాబ్‌మేళాలో 179 మందికి ఉద్యోగాలు



నియామక పత్రమిస్తున్న ట్రస్ట్ చైర్మన్ సాయి

అమలాపురం రూరల్: అమలాపురం కొంకాపల్లిలో హెల్పింగ్ జాబ్ ప్లేస్‌మెంట్ కార్యాలయంలో శుక్రవారం అడబాల ట్రస్ట్ చైర్మన్ అడబాల సాయి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో మొత్తం 316 మంది ఇంటర్వ్యూకి హాజరు కాగా 179 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. ఈ జాబ్‌మేళాలో డెక్కన్, ఐసీఐసీఐ తదితర 13 కంపెనీలకు ఇంటర్వ్యూలు జరిగాయి. రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు ప్యాకేజీలతో ఈ ఉద్యోగాలు లభించాయి. అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఆజాద్ నాగసుధా మాట్లాడుతూ అడబాల ట్రస్ట్ స్థాపించి అడబాల సాయి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు.

తపాలా డివిజన్‌కు 10 అవార్డులు

రాజమహేంద్రవరం సిటీ: గడచిన ఆర్థిక సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను రాజమహేంద్రవరం తపాలా డివిజన్‌లోని ఉద్యోగులు వివిధ అంశాల్లో 10 అవార్డులు పొందారు. రాజమహేంద్రవరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు శుక్రవారం ఈ విషయం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తపాలా సర్కిల్‌కు సంబంధించి విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులను ఉన్నతాధికారులు బహూకరించారని పేర్కొన్నారు. తపాలా డివిజన్ అధికారులను, ఉద్యోగులను ఆయన అభినందించారు.

రౌండ్ల వారీగా గ్రౌండ్ రియాలిటీ

- సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు విస్తృత ఏర్పాట్లు
- మొత్తం 170 టేబుళ్లు... 302 రౌండ్‌లు
- అమలాపురం పార్లమెంట్‌కు 82 టేబుళ్లు.. 168 రౌండ్‌లు
- ఏడు అసెంబ్లీలకు 88 టేబుళ్లు.. 134 రౌండ్‌లు
- సిద్ధమవుతున్న జిల్లా యంత్రాంగం

సాక్షి అమలాపురం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతుండంతో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లలో తలమునకలైంది. జిల్లా ఏర్పడిన తరువాత తొలిసారి సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరుగుతుండడంతో పోటీలో ఉన్న అభ్యర్థుల కన్నా అధికారుల్లో ఉత్కంఠ ఎక్కువగా ఉంది. అమలాపురం పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాల కౌంటింగ్‌కు సంబంధించి సిబ్బంది నియామకం... పార్లమెంట్, అసెంబ్లీలకు విడివిడిగా టేబుళ్ల కేటాయింపు, ఆయా అసెంబ్లీ స్థానాలకు పడిన ఓటింగ్ ఆధారంగా కౌంటింగ్ రౌండ్లు, అందుకు పట్టే సమయాన్ని జిల్లా యంత్రాంగం విడుదల చేసింది.

జిల్లాలో అమలాపురం పార్లమెంట్‌తోపాటు మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం, అమలాపురం, పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ కాట్రేనికోన మండలం చెయ్యేరులోని శ్రీనివాస ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల నాలుగవ తేదీన జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ మొదలు కానుంది. పోస్టల్ ఓట్లు, సర్వీసు ఓట్లు, ఈవీఎంలలో పడిన ఓట్లను ఒకేసారి లెక్కించనున్నారు. ఇందుకుగాను స్థానిక కాలేజీలో ఆయా నియోజకవర్గాలకు అనుగుణంగా రూములు గుర్తించారు. పార్లమెంట్, అసెంబ్లీలకు కలిపి మొత్తం 170 టేబుళ్లలో కౌంటింగ్ జరగనుంది. రెండింటికీ కలిపి మొత్తం 302 రౌండ్‌లు జరగనున్నాయి. పార్లమెంట్‌కు 82 టేబుళ్లు.. 168 రౌండ్‌లు, అసెంబ్లీలకు 88 టేబుళ్లు.. 134 రౌండ్‌ల చొప్పున కౌంటింగ్ జరగనుంది.



కౌంటింగ్ ప్రక్రియ (ఫైల్)

ప్రత్యేకాధికారులు వీరే

అమలాపురం పార్లమెంట్ కౌంటింగ్‌ను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చేపట్టనున్నారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో పార్లమెంట్ కౌంటింగ్ ఉన్నతాధికారులను ఇన్‌చార్జిలుగాను, అబ్జర్వర్లుగా నియమించారు. పార్లమెంట్ పరిధిలో రామచంద్రపురం నియోజకవర్గానికి హాల్ ఇన్‌చార్జిలుగా సుధాసాగర్ (ఆర్డీవో), ముమ్మిడివరానికి వి.మదన్‌మోహన్ (కేఆర్‌సీసీ), అమలాపురానికి జి.కేశవవర్ధన్‌రెడ్డి (ఆర్డీవో), రాజోలు ఎస్.నుపూర్‌అజయ్ (జాయింట్ కలెక్టర్), పి.గన్నవరం ఎ.శ్రీరామచంద్రమూర్తి (జెడ్పీ సీఈవో), కొత్తపేట జి.వి.సత్యానారాయణ ఆర్డీవో, మండపేట డి.వి.ఎస్.ఎల్లారావు (డీఎం సివిల్ సప్లయిస్)లను నియమించారు. వీటికి అబ్జర్వులుగా ఎన్నికల కమిషన్ నియమించిన ప్రదీప్‌కుమార్, అజయన్, రాజేశ్వర్ గోయిల్, సీహెచ్.అర్జున్ కృష్ణారావు, కై లాష్ బుందేలాను నియమించారు. అసెంబ్లీ స్థానాలకు సంబంధించి ఆయా నియోజకవర్గ కేంద్రాలలోని తహసీల్దార్లను నియమించారు.

అమలాపురం పార్లమెంటు పరిధిలో లెక్కింపు వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	టేబుళ్ల సంఖ్య	మొత్తం రౌండ్లు	లెక్కింపునకు పట్టే సమయం
రామచంద్రపురం	239	10	24	9 గంటలు
ముమ్మిడివరం	268	14	27	10 గంటలు
అమలాపురం	235	12	24	9 గంటలు
రాజోలు	205	14	21	8 గంటలు
పి.గన్నవరం	212	12	22	8 గంటలు
కొత్తపేట	262	10	27	10 గంటలు
మండపేట	223	10	23	9 గంటలు

అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇలా..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	టేబుళ్ల సంఖ్య	మొత్తం రౌండ్లు	లెక్కింపునకు పట్టే సమయం
రామచంద్రపురం	239	10	24	9 గంటలు
ముమ్మిడివరం	268	14	19	7 గంటలు
అమలాపురం	235	14	17	6 గంటలు
రాజోలు	205	14	15	6 గంటలు
పి.గన్నవరం	212	12	18	7 గంటలు
కొత్తపేట	262	14	19	7 గంటలు
మండపేట	223	10	22	8 గంటలు

కౌంటింగ్ జరిగేది ఇక్కడే..



కౌంటింగ్ జరిగే శ్రీనివాస ఇంజినీరింగ్ కాలేజీ

పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు కౌంటింగ్ నిర్వహించే స్థానాలను అధికారులు ప్రకటించారు. పార్లమెంట్ పరిధిలోని రామచంద్రపురం నియోజకవర్గానికి సంబంధించి స్వామి వివేకానంద బ్లాక్‌లోని 2007 రూమ్‌లోను, అసెంబ్లీ 2005 రూమ్‌లోను, ముమ్మిడివరం (పార్లమెంట్) అదే బ్లాక్‌లోని 2101, అసెంబ్లీ 2102, మండపేట (పార్లమెంట్) 2207, అసెంబ్లీ 2210, అమలాపురం (పార్లమెంట్) మోక్షగుండం విశ్వేశ్వరయ్య బ్లాక్‌లోని 1206, అసెంబ్లీకి 1204 రూమ్‌లోను, రాజోలు (పార్లమెంట్) అదే బ్లాక్‌లోని 1209, అసెంబ్లీకి 1210, కొత్తపేట (పార్లమెంట్) 1108, అసెంబీ 1111, పి.గన్నవరం (పార్లమెంట్)ను శ్రీసాయి బ్లాక్‌లోని 3,206, అసెంబ్లీకి 3204 రూమ్‌లలో కౌంటింగ్ నిర్వహించనున్నారు.

క్యాసో దాడులు.. తనిఖీలు విస్తృతం



కాట్రేనికోన మండలం బలుసుతిప్పలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

అమలాపురం టౌన్: ఓట్ల లెక్కింపు రోజు దగ్గర పడుతున్న క్రమంలో జిల్లాలో పోలీసు అధికారులు ఆయా ప్రాంతాల్లో క్యాసో తనిఖీలు, దాడులను మరింత విస్తృతం చేశారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ఈ దాడులు, తనిఖీలు జరుగుతున్నాయి. వీటి వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది.

- మండపేట పోలీస్ యంత్రాంగం సాయుధ బలగాలతో కలిసి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు రోజున సంఘ విద్రోహ శక్తులు అసాంఘిక కార్యకలాపాలకు తెగబడితే సాయుధ బలగాల రియాక్షన్ ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా, ప్రయోగాత్మకంగా ఆ మాక్ డ్రిల్ ద్వారా కళ్లకు కట్టినట్టు చూపించారు.
- కాట్రేనికోన మండలం బలుసుతిప్ప గ్రామంలో 1,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- రామచంద్రపురం మండలం ఉండూరు, మండల కేంద్రం రాయవరంలో పోలీసు అధికారులు స్థానిక రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలతో అవగాహన సదస్సులు నిర్వహించి ఓట్ల లెక్కింపు రోజు బందోబస్తు ఎంతటి తీవ్రంగా ఉంటుందో తెలియజేసి హెచ్చరికలు జారీ చేశారు.
- కాట్రేనికోన మండలం చెయ్యేరు ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు బందోబస్తుపై జిల్లా ఎస్పీ శ్రీధర్ జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి పోలీసు అధికారులతో సమీక్షించారు.

క్యాన్సర్ మరణాల్లో 25 శాతం పొగాకు వల్లే..



ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీ రాణి, వైద్యులు

- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీ రాణి
- అమలాపురంలో చైతన్యవంతంగా ర్యాలీ

అమలాపురం టౌన్: ఏటా క్యాన్సర్ వ్యాధి వల్ల మరణిస్తున్న వారిలో 25 శాతం మంది పొగాకు వినియోగించేవారే ఉంటున్నారని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీ రాణి వెల్లడించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి గడియారం స్తంభం వరకూ శుక్రవారం ఉదయం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలను నినాదాల రూపంలో ప్లకార్డులపై రాసి ర్యాలీలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మశ్రీ రాణి మాట్లాడుతూ ఏటా చాలామంది పరోక్షంగా సిగరెట్ పొగ పీల్చడం వల్ల క్యాన్సర్ కారకాలతో మృత్యువాత పడుతున్నారని అన్నారు. పొగాకు వాడకం వల్ల సంతానోత్పత్తి సమస్యలు కూడా ఉత్పన్నం అవుతాయన్నారు. 1988 సంవత్సరం మే 31వ తేదీని ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించారని చెప్పారు. ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ జాన్ లెవి ఇంజేటి మాట్లాడుతూ పొగ తాగడం వల్ల మనిషి శరీరంలోని గొంతు, ఊపిరి తిత్తులు, కడుపు, కాలేయం, మూత్ర పిండాలు తదితర మానవ ప్రధాన అవయవాలు క్యాన్సర్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదనపు అధికారిణి డాక్టర్ సీహెచ్‌పీ భారతలక్ష్మి మాట్లాడుతూ పొగాకు వల్ల వచ్చే రోగాలకు సకాలంలో స్పందించకపోతే భవిష్యత్‌లో సమాజంలో పొగాకు నియంత్రణ కష్టమవుతుందని ఆందళన వ్యక్తం చేశారు. ర్యాలీలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ సౌమ్య పసుపులేటి, ఈఎన్‌టీ వైద్యురాలు డాక్టర్ అనూష, ఎన్‌టీసీపీ సోషల్ వర్కర్ ప్రమీల, జన కళ్యాణ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెలా తప్పని పింఛన్ కష్టాలు



పినపళ్లలో గత ఏప్రిల్ నెలలో పింఛన్ కోసం పడిగాపులు పడిన లబ్ధిదారులు

- ఇన్నాళ్లూ వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుని ఇంటికే పెన్షన్
- చంద్రబాబు కుట్రతో మూడు నెలలుగా నిలిచిపోయిన ఇంటింటి పంపిణీ
- జిల్లాలో 2,43,932 మంది లబ్ధిదారులకు రూ 70.97 కోట్లు అందజేతకు సిద్ధం

ఆలమూరు: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక టీడీపీ అధినేత చంద్రబాబు చేయించిన ఫిర్యాదుల మేరకు ఈసీ ఆదేశాలతో గ్రామ వలంటీర్ వ్యవస్థను తొలగించడంతో పింఛన్‌దారులకు మళ్లీ టీడీపీ హయాం నాటి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ నెల పింఛన్‌ను కొంతమందికి ఇంటి వద్ద, మరికొంత మందికి గ్రామ, వార్డు సచివాలయాల వద్ద గ్రామ సచివాలయాల ఉద్యోగులు పంపిణీ చేశారు. టీడీపీ నేతల నిర్వాకం వల్ల ఎండ తీవ్రత తట్టుకోలేని పలువురు వృద్ధులు మృత్యువాత పడ్డారు. దీనిపై స్పందించి ప్రభుత్వం ఇచ్చిన విజ్ఞాపనల మేరకు పునరాలోచన చేసిన ఎన్నికల కమిషన్ పింఛన్ పంపిణీకి మార్గదర్శకాలను జారీ చేసింది. అయినా పింఛన్‌దారుల దుస్థితిలో ఎటువంటి మార్పు రాలేదు సరికదా మరిన్ని కష్టాలు ప్రారంభమయ్యాయి. దీంతో మే నెల పింఛన్‌ను నిర్దేశించిన కొంతమంది వృద్ధులకు, దివ్యాంగులకు, నడవలేని, మంచం పట్టిన రోగులకు ఇంటి వద్దకే తీసుకువెళ్లి ఇవ్వగా మిగిలిన లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలోనే జమ చేశారు. జూన్ నెలలో అదే పద్ధతి కొనసాగుతుందని డీఆర్‌డీఏ అధికారులు చెబుతుండటంతో మళ్లీ ఈ నెల కూడా కష్టాలు తప్పేలా లేవని పింఛన్‌దారులు ఆవేదన చెందుతున్నారు.

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలంటున్న లబ్ధిదారులు

రాష్ట్రానికి మళ్లీ జగనన్న ముఖ్యమంత్రిగా రావాలని, గతంలో మాదిరిగా పింఛన్‌ను గ్రామ వలంటీర్ల ద్వారా ఇంటికే అందించాలని సామాజిక పింఛన్‌దారులు ముక్తకంఠంతో కోరుతున్నారు. టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌ను ప్రేరేపించి మూడు నెలలుగా ముప్పుతిప్పలు పెడుతూ ఇలాంటి దారుణమైన పరిస్థితులు కల్పించడంపై పింఛన్‌దారులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పొరపాటున మళ్లీ అధికారంలోకి వస్తే ఇంకెన్ని దారుణాలు చూడవలసి వస్తుందోనని మదన పడుతున్నారు. ప్రజల మనసెరిగి పాలన సాగించింది జగనన్న ప్రభుత్వమేనని కితాబును ఇస్తున్నారు. సీఎంగా జగన్ ఉంటేనే మళ్లీ తమకు ఇబ్బందులు తప్పుతాయని చెబుతున్నారు.

పంపిణీకి సర్వం సిద్ధం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాలు, నాలుగు పురపాలక సంఘాల పరిధిలో జూన్ నెలకు సంబంధించి శనివారం సామాజిక పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధమైంది. జిల్లాలో 2,43,932 మంది సామాజిక పింఛన్ లబ్ధిదారులుండగా రూ 70.97 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇంటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేసేందుకు 6,94,12 మందిని ఎంపిక చేయగా రూ 18.61 కోట్లు పంపిణీ చేయనున్నారు. 1,74,520 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి రూ.52.32 కోట్లను నేరుగా జమ చేయనున్నారు. గత రెండు నెలల మాదిరిగానే పింఛన్ లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరిగి, గంటల తరబడి వేచి ఉండి పింఛన్ సొమ్మును తీసుకునే దుస్థితి దాపురించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బ్యాంకుల్లో అనేక మంది లబ్ధిదారుల ఖాతాలకు కాలం చెల్లిపోవడంతో మళ్లీ వాటిని వ్యయ ప్రయాసలకోర్చి పునరుద్ధరించేందుకు అనేక అగచాట్లు పడవలసిన పరిస్థితి నెలకొంది.

రండి.. ఇంటర్‌లో చేరండి

- ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాల పెంపుపై దృష్టి
- ఇంటింటికీ వెళ్లి అధ్యాపకుల ప్రచారం
- జిల్లాలో 13 సర్కారు జూనియర్ కాలేజీలు

రాయవరం: పదవ తరగతి అనంతరం ఇంటర్మీడియెట్ కీలకం. పిల్లల భవితను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు కోర్సులను ఎంపిక చేసుకుని, మంచి కళాశాలల్లో చేర్చేందుకు ప్రాధాన్యం ఇస్తుంటారు. ఇందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం చర్యలు తీసుకుని గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, సాధారణ కళాశాలలతో పాటు, ఒకేషనల్ కళాశాలలను ఏర్పాటు చేసింది. నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా వసతులను కూడా కల్పిస్తోంది. మనబడి నాడు-నేడు పథకంలో భాగంగా 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను అభివృద్ధి చేశారు.



రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల

నోటిఫికేషన్ విడుదల

ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్రవేశాల సంఖ్య పెంపుపై ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు దృష్టి సారించారు. అడ్మిషన్ల ప్రక్రియపై జిల్లా అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఉండగా, 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్‌లో 2,073 మంది విద్యార్థులు వివిధ గ్రూపుల్లో ప్రవేశం పొందారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో గత ఏడాది కన్నా అధిక సంఖ్యలో ప్రవేశం పొందేలా కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు కృషి చేస్తున్నారు.

వసతులు, బోధనపై ప్రచారం

ప్రధానంగా అధ్యాపకులు ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లి పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థుల జాబితాను సేకరించారు. దీని ఆధారంగా పరిసర ప్రాంతాల్లోనూ, గ్రామాల్లోనూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఒత్తిడి లేని విద్యతోపాటు అమలు చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ తదితర కోర్సుల గురించి వివరిస్తున్నారు. సత్వరం ఉపాధి లభించే వత్తి విద్య కోర్సులు, వాటిలో లభించే ఉపాధి అవకాశాలు తెలియజేస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, కళాశాల ప్రగతి గురించి వివరించే విధంగా కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఎలాంటి రుసుములు లేకుండా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఉపకార వేతనాలు అందజేస్తున్న విషయాన్ని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు

రాయవరం, రామచంద్రపురం, మండపేట, పామర్రు, ఆలమూరు, రావులపాలెం, రాజోలు, మామిడికుదురు, అమలాపురం(బాలికలు), ముక్తేశ్వరం, ముమ్మిడివరం, కొత్తపేట, కేశనపల్లి (మలికిపురం మండలం), మలికిపురం (ఎయిడెడ్ జూనియర్ కళాశాల)

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి



తల్లిదండ్రులు ఇంటర్మీడియట్ బోర్డ్ అనుమతి ఉన్న కళాశాలలోనే విద్యార్థులను చేర్చాలి. ప్రభుత్వం అనుమతించిన కళాశాలను పరిశీలించిన తర్వాత మాత్రమే విద్యార్థులను చేర్చడం మంచిది. ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల్లో విద్యార్థులను చేర్పించి, అనంతరం ఇబ్బందులు పడవద్దు. ప్రవేశ సమయంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– వనుము సోమశేఖరరావు, ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖ అధికారి, అమలాపురం

అడ్మిషన్ షెడ్యూల్ ఇదీ..

అప్లికేషన్స్ ప్రారంభం : మే 15
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: జూన్ 1
మొదటి విడత అడ్మిషన్స్ ప్రారంభం: మే 22
మొదటి విడత అడ్మిషన్స్ ముగింపు తేదీ: జూన్ 1
ఇంటర్ ఫస్టియర్ తరగతులు ప్రారంభం: జూన్ 1
రెండవ దశ అడ్మిషన్స్ ప్రారంభం: జూన్ 10
రెండవ దశ అడ్మిషన్స్ ముగింపు తేదీ: జూలై 1

ఇంటర్‌లో అడ్మిషన్స్ ఇలా..

కేటగిరీ	సీట్ల రిజర్వేషన్
ఎస్సీ	15 శాతం
ఎస్టీ	6 శాతం
బీసీ	29 శాతం
(ఎ–7 శాతం, బీ–10 శాతం, సీ–1 శాతం డీ–7 శాతం, ఈ–4 శాతం)	
సీడబ్ల్యూఎస్ఎన్	3 శాతం
ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా కరిక్యులర్	5 శాతం
మాజీ సైనికులు, డిఫెన్స్ పర్సనల్ (రాష్ట్రంలో నివసించే వారు)	3 శాతం
ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్ (ఈడబ్ల్యూఎస్)	10 శాతం

బాలికలకు ప్రత్యేక కళాశాలలు లేనిచోట 33.33 శాతం సీట్లు వారికి రిజర్వు చేయాల్సి ఉంది.

క్లుప్తంగా

హత్య కేసులో నిందితుడి అరెస్టు

తుని: యాచకుడిని హత్య చేసిన వ్యక్తిని గుర్తించి అరెస్టు చేశామని టౌన్ సీఐ ఎం.గీతా రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకెళితే ఈ నెల 25న స్థానిక కొండవారిపేటకు వెళ్లే దారిలో రైల్వే ప్రహరీని ఆనుకొని యాచకుడు డేవిడ్‌రాజు(45) మృతి చెంది ఉన్నాడు. దీనిపై టౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. శవాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. శవాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి.. ఎస్సై రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేయించారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన యడ్ల అప్పారావు(చిన్ని)ను ముద్దాయిగా గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడు అప్పారావుకి మృతుడైన డేవిడ్‌రాజుకు గత పదేళ్లుగా పరిచయం ఉంది. నిందితుడు యలమంచిలి, సామర్లకోట రైల్వే స్టేషన్ల మధ్య ట్రైన్లలో గుట్కాలు, సిగరెట్లు అమ్ముతూ అప్పుడప్పుడూ తుని రైల్వేట్రాక్ వద్ద నివాసముంటున్న డేవిడ్ రాజును కలిసేవాడు. ఈ క్రమంలో ఈ నెల 25న ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. డబ్బుల విషయంలో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. నిందితుడు అప్పారావు మృతుడు డేవిడ్‌రాజు తలను నేలపై బలంగా కొట్టడంతో మృతి చెందాడు.

ఐదుకు చేరిన మృతుల సంఖ్య


మాదాసి ప్రశాంత్‌కుమార్ (ఫైల్)

అమలాపురం రూరల్: భట్నవిల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చనిపోవడంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. పోలీసుల కథనం ప్రకారం.. ఏప్రిల్ 28న అర్ధరాత్రి భట్నవిల్లి 216 జాతీయ రహదారిలో లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో మామిడికుదురు, పి.గన్నవరం మండలాలకు చెందిన సాపే నవీన్, కొళ్లబత్తుల జతిన్, నల్లి నవీన్‌కుమార్, వల్లూరి అజయ్ మృతి చెందారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మామిడికుదురు మండలం నగరం పితానివారిమెరక చెందిన మాదాసి ప్రశాంత్‌కుమార్‌కు (16) కిమ్స్‌లో ఆపరేషన్ చేయడంతో 32 రోజులు వైద్యం పొందాడు. రెండు రోజుల కిందట ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిన అనంతరం శుక్రవారం సాయంత్రం ప్రశాంత్‌కుమార్ మృతి చెందాడు. దీంతో మొత్తం మృతుల సంఖ్య ఐదుకు చేరింది. వైద్యం నిమిత్తం రూ.లక్షలు ఖర్చు చేసినా తమ కుమారుడి ప్రాణాలు దక్కలేదని తండ్రి శ్రీరాములు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశాంత్‌కుమార్ ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు.

సత్వర వైద్యానికి అంబులెన్స్

- 1962 టోల్ ఫ్రీ నంబర్‌తో పశువులకు అంబులెన్స్ ఏర్పాటు
- పాడిరైతు ఇంటి ముగింటనే అందుతున్న పశువైద్య సేవలు

ఆలమూరు: పశువులకు సత్వర వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా 1962 అంబులెన్స్ వ్యవస్థను తీసుకువచ్చింది. జనానికి 108, 104 మాదిరిగానే పశువులకు అనారోగ్యం, ఏదైనా రోడ్డు ప్రమాదం సంభవిస్తే సత్వరం స్పందించేలా 2022 మే 20న పశువైద్య సంచార సేవలను ప్రవేశపెట్టింది. పాడి పశువులు ఆపదలో ఉంటే సత్వరమే సంబంధిత యజమాని 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే అరగంటలో అంబులెన్స్ వచ్చి ఉచితంగా సేవలను అందిస్తుంది. వ్యాధి తీవ్రత తగ్గే వరకూ మందుల పంపిణీతో పాటు దిగువ స్థాయి సిబ్బంది పర్యవేక్షణలో ఉంచుతుంది. పాడిరైతులకు జీవనాధారమైన పశువులను రక్షిస్తూ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. 2019 పశు గణాంకాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,97,938 మూగజీవాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 99 పశు వైద్యశాలలు ఉండగా 11 ఏడీఏ కార్యాలయాల సహకారంతో 453 ఆర్‌బీకేల ద్వారా పశువైద్యశాఖ సేవలు అందిస్తోంది. పశువుల సంరక్షణతో పాటు పెంపుడు కుక్కలకు ఏ విధమైన వ్యాధులు సోకకుండా టీకాలు వేస్తున్నారు. పాడి పరిశ్రమ, మూగజీవాల రక్షణ, కోళ్ల పెంపకం అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఐదేళ్ల నుంచి కృషి చేస్తోంది. మండపేటలోని ప్రాంతీయ పశువైద్య శిక్షణ కేంద్రంలో అధునాతనంగా ఏర్పాటు చేసిన థియేటర్‌లో పశువులకు మెరుగైన శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి.

నిరంతర వైద్య సేవలు

జిల్లాలో రూ.16.19 కోట్లతో కొనుగోలు చేసిన 14 సంచార వాహనాలను నియోజకవర్గానికి రెండు చొప్పున పశుసంవర్ధశాఖ పాడిరైతులకు అందుబాటులో ఉంచింది. జిల్లాలో ప్రతి రోజూ సగటున 2,148 పశువులకు నిరంతరం వైద్య సేవలను అందిస్తోంది. జిల్లాలోవున్న పశువుల ఆస్పత్రుల్లో 81 రకాల మందులను అందుబాటులో ఉంచింది. జిల్లాలో గడచిన రెండేళ్ల కాలంలో పశువైద్యశాఖ ద్వారా రూ.2.35 కోట్ల మందులను ఉచితంగా అందజేసి సుమారు 60 వేల పశువులను, గొర్రెలను, మేకలను అనారోగ్యం నుంచి రక్షించి పాడిరైతులకు బాసటగా ప్రభుత్వం నిలిచింది.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా..

పశువులన్నింటికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలన్న ప్రభుత్వ దృఢసంకల్పం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇప్పటికే కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ తదితర రాష్ట్రాల పశువైద్య బృందాలు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో పర్యటించి పశుసంచార వైద్యసేవలపై అధ్యయనం చేశాయి. గతంలో పశువులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే సుమారు ఐదు నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పశువుల ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్సను అందించవలసి వచ్చేది.

సంచార పశువైద్యశాల (అంబులెన్స్) ప్రత్యేకతలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన మొబైల్ అంబులేటరీ క్లినిక్స్ (సంచార పశువైద్యశాల)లో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. పశువులకు ఏవిధమైన అనారోగ్య సమస్యలు తలెత్తినా 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే అరగంట వ్యవధిలో పశువుల మకాం వద్దకు అంబులెన్స్ చేరుకుంటుంది. అందులో పశువైద్యాధికారి, సాంకేతిక సహాయ సిబ్బంది, డ్రైవర్ కమ్ అటెండర్ ఉంటారు. ఆ అంబులెన్స్‌లో మైక్రోస్కోప్‌తో పరీక్షలు చేసే విధంగా 51 ప్రత్యేక పరికరాలు ఉంటాయి. వాటితో ప్రథమ చికిత్సను అందించడంతో పాటు కృత్రిమ గర్భధారణ తదితర ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారు. 20 పరికరాలతో రోగ నిర్ధారణ, 15 పరికరాలతో రక్త పరీక్షలు చేసి సత్వరమే ఫలితాలను తెలియజేస్తారు. అంబులెన్స్‌లో సుమారు రూ.30 వేలు విలువ చేసే 81 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల ఉచితంగా చికిత్సను అందించడంతో పాటు మందులను కూడా పశువైద్యశాఖ సమకూర్చుతుంది. అనారోగ్యం తీవ్రత ఉన్న పశువులను సమీప పశువుల ఆస్పత్రులకు తరలించేందుకు వీలుగా అంబులెన్స్‌లో లిఫ్ట్ సౌకర్యాన్ని కలిపించారు. నిమిషాల వ్యవధిలో పశువైద్యశాలకు తరలించి నాణ్యమైన చికిత్సను అందించిన అనంతరం ఆ అంబులెన్స్ మళ్లీ పశువుల మకాం వద్దకు తీసుకువస్తుంది. దీంతో పశువులను తరలించేందుకు అయ్యే వ్యయ,ప్రయాసలు తప్పుతున్నాయని రైతులు చెబుతున్నారు.


పినపళ్లలో సంచార పశువైద్యశాల ద్వారా పాడి పశువులకు సేవలందిస్తున్న వెటర్నరీ ఉద్యోగులు

జిల్లాలో ఇలా..

వరుస సంఖ్య	పశువుల వివరాలు	సంఖ్య
1.	ఆవులు	75,839
2.	గేదెలు	1,60,403
3.	మేకలు	26,901,
4.	గొర్రెలు	28,475
5.	పందులు	6,120


పశువైద్య సేవలు అందించే అంబులెన్స్

సమగ్రంగా సేవలు



ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా రైతుల సహకారంతోపాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. పశు వైద్యశాల అంబులెన్స్‌లో సత్వరమే సేవలను అందించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నాం.

– ఎల్.అనిత, ఏడీఏ, ఆలమూరు

ప్రభుత్వ తోడ్పాటు బాగుంది



పశువులకు వైద్యపరంగా ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు మాలాంటి రైతులకు వరంగా మారింది. గతంలో సుదూర ప్రాంతాలకు పశువులను తీసుకువెళ్లి వైద్యం చేయించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ప్రయాస తప్పింది.

– తోలేటి అమ్మిరాజు, పాడిరైతు, సంధిపూడి.

వేటాడిన మృత్యువు

- చేపల వేటకు వెళుతూ ఇద్దరు మత్స్యకారుల మృతి
- మూడు వాహనాలు ఢీ–ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఆలమూరు అగ్నికుల క్షత్రియులపేటలో తీవ్ర విషాదం


లంకే సూరిబాబు (ఫైల్) వనమాడి సాయిబాబు (ఫైల్)

ఆలమూరు: పొట్టకూటి కోసం చేపలవేటకు వెళుతున్న మత్స్యకారులు విగతజీవులుగా మారారు. ట్రాక్టర్ రూపంలో ఇద్దరినీ మృత్యువు కబళించింది. మరో ముగ్గురిని తీవ్ర గాయాలు పాలు చేసింది. చేపల వేటకు బయలుదేరిన పావుగంటలోనే తమ వారు మృత్యువాత పడ్డారనే దుర్వార్త విన్న ఆలమూరులోని అగ్నికుల క్షత్రియులపేట వాసులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

ఆలమూరు–మండపేట రోడ్డులోని మోదుకూరు పరిధిలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆలమూరుకు చెందిన ఐదుగురు మత్స్యకారుల బృందం బొలెరో వాహనంలో వలలు తీసుకుని ఉదయాన్నే రాజానగరం మండలంలోని తుంగపాడులో చేపల వేట సాగించేందుకు బయలుదేరారు. స్థానిక ఉషాలక్ష్మి రైసుమిల్లు సమీపంలోని వరహాల (కొత్త) కాలువ రేవు వద్దకు వచ్చేసరికి మండపేట నుంచి రేషన్ బియ్యం లోడుతో వస్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం వెనుక భాగంలో నిల్చుని ఉన్న వనమాడి సాయిబాబు (62), లంకే సూరిబాబు (49) అక్కడికక్కడే ట్రక్కులోనే మృతి చెందారు. అందులో ప్రయాణిస్తున్న కొప్పాడి రమణ, డొక్కాడి శ్రీనివాసు, వనమాడి మావుళ్ల స్వామికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మావుళ్ల స్వామి ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ట్రాక్టర్, బొలెరో వాహనాల డ్రైవర్లు ఇద్దరూ ప్రమాదాన్ని ముందే పసిగట్టి కిందకు దూకేయడంతో క్షేమంగా బయట పడ్డారు. రోడ్డు ప్రమాదం సంభవించిందన్న సమాచారం తెలుసుకున్న ఎస్సై ఎల్.శ్రీనునాయక్ తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తప్పించి అప్పటికే నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మోదుకూరు వీఆర్వో సుజాత ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారు. రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

పార్క్ చేసిన లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే..

కాలువ రేవు వద్ద నీటితో శుభ్రపరచేందుకు లారీని పార్క్ చేశారు. శుభ్రపరిచిన అనంతరం ఆ లారీని తీసుకెళ్లే క్రమంలో వెనుకా ముందు వస్తున్న వాహనాలను గమనించకుండా వెనుక గేర్ వేసి నడపడంతో ఈ ప్రమాదం సంభవించింది. మండపేట వైపు నుంచి ధాన్యం లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఈ లారీని తప్పించే క్రమంలో మత్స్యకారులు ప్రయాణిస్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొంది. ఇదే సమయంలో చింతలూరుకు చెందిన ఒక యువకుడు తన ద్విచక్ర వాహనంతో వేగంగా వచ్చి ప్రమాదానికి గురైన ఆ రెండు వాహనాలను ఢీకొట్టి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం తీవ్రంగా దెబ్బతినగా ఆ యువకుడికి స్వల్ప గాయాలు అయినట్టు తెలుస్తోంది.


సాయిబాబు, సూరిబాబు మృతదేహాలు


మోదుకూరులో ఢీకొన్న మూడు వాహనాలు

తీవ్ర విషాదంలో అగ్నికుల క్షత్రియపేట

ఆలమూరులోని అగ్నికుల క్షత్రియపేటకు చెందిన ఇద్దరు మృత్యువాత పడటంతో అక్కడ విషాద ఛాయలు అలుముకున్నాయి. గతంలోను ఇలాంటి ఘటనలు జరిగాయి. ఈ నేపథ్యంలో గంగపుత్రులకు ఇలాంటి కష్టాలు ఎందుకు ఎదురవుతున్నాయంటూ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. సూరిబాబు, సాయిబాబు కుటుంబ సభ్యులు తాము పెద్దదిక్కును కోల్పోయామంటూ విలపిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తారని ఎదురుచూస్తున్న వారు.. ఇంటి దైవాలు ఇక లేరనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నారు. తమకు ఇక దిక్కెవరూ అంటూ మృతదేహాల వద్ద కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది.

ప్రమాదవశాత్తూ బావిలో పడి వ్యక్తి మృతి


సాయిబాబు మృతదేహం

మామిడికుదురు: బహిర్భూమికి వెళ్లి మోట బావిలో నీళ్లు తోడుకుంటూ ప్రమాదవశాత్తూ దానిలో పడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన పెదపట్నంలంక గ్రామంలో జరిగింది. నగరం ఎస్సై పి.సురేష్ కథనం ప్రకారం పెదపట్నంలంకకు చెందిన వడ్రంగి మేస్త్రి యేడిద సాయిబాబు (48) గురువారం రాత్రి వడ్రంగి పని ముగించుకుని ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన తరువాత బహిర్భూమికి బయటకు వెళ్లాడు. అతను ఎంత సేపటికి తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య దుర్గాభవానికి అనుమానం వచ్చి స్థానికుల సహాయంతో గాలించగా మోట బావిలో పడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. దీంతో ఆమె బిగ్గరంగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి నూతిలో దిగి సాయిబాబును బయటకు తీసుకువచ్చారు. బయటకు వచ్చిన తరువాత సీపీఆర్ చేయగా కొద్దిసేపు ప్రాణంతో ఉన్నాడు. 108 అంబులెన్సుకు ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి సాయిబాబును పరీక్షించి అప్పటికే అతను మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి భార్య దుర్గాభవాని ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్సై సురేష్ తెలిపారు. మృతుడు సాయిబాబు నిరుపేద కుటుంబానికి చెందిన వాడు. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి వారి కుటుంబానిది. సాయిబాబు మృతితో ఉన్న దిక్కు కోల్పోయామని భార్య, అతని ఇద్దరు కుమార్తెలు తనుశ్రీ, కావ్యశ్రీ కన్నీరు మున్నీరుగా విలపించారు.

రైలు నుంచి జారిపడి అసోం వాసి..

తుని: తుని జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి అసోం రాష్ట్రానికి చెందిన రాజు రాయ్(39) మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ మోహనరావు తెలిపారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అన్నవరం–దుర్గాడ గేటు మధ్యలో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి రాజు రాయ్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 3 గంటల సమయంలో మృతి చెందినట్టు ఆన్ డ్యూటీ డాక్టర్ తెలిపారు. జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేయగా మృతుడు అసోం రాష్ట్రానికి చెందిన రాజు రాయ్‌గా గుర్తించామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, అదే ప్రాంతానికి చెందిన శంకర్ తపతో కలిసి రాష్ట్రంలోని అమరావతిలో కూలీ పని కోసం రైలులో వస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని మోహనరావు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

సీతానగరం: మండలంలోని ములకల్లంకకు చెందిన పొలిన భాగ్యలక్ష్మి (60) రాజమహేంద్రవరంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు మృతి చెందారని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. గురువారం ఉదయం 8.30 గంటలకు ములకల్లంక నుంచి పోలిన గణేశ్వరరావు తన భార్య భాగ్యలక్ష్మితో బొబ్బిల్లంక సెంటర్ వద్దగల షాపు వద్దకు వచ్చారు. తిరిగి వెళుతుండగా రాజమహేంద్రవరం నుంచి సీతానగరం వైపు వెళ్లుతున్న పాసింజర్ ఆటో గణేశ్వరరావు, భాగ్యలక్ష్మి లను వెనుక నుంచి ఢీకొట్టింది. భాగ్యలక్ష్మి తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లగా, గణేశ్వరరావుకు గాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రిలో చేర్చగా, చికిత్స పొందుతూ భాగ్యలక్ష్మి మృతి చెందారు. కేసు నమోదు చేశామని ఎస్సై రామకృష్ణ తెలిపారు

యువతి ఆత్మహత్య

యానాం: తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ పరిధిలో శుక్రవారం యువతి బలవన్మరణానికి పాల్పడింది. వివరాల ప్రకారం పత్తిగొంది గ్రామానికి చెందిన డి.భారతి(25) తన స్వగృహంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఆత్మహత్యకు గల కారణాలను విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతురాలు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఈ హఠాత్తు పరిణామంతో ఆమె కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనా స్థలిని కోరంగి పోలీస్ స్టేషన్ పరిధికి వెళుతుండటంతో వారికి కేసును బదిలీ చేయనున్నారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 21 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 5,740 మంది విద్యార్థులు

రాయవరం: ఇప్పటికే పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు పూర్తి కాగా, నేటి నుంచి ఏపీ సార్వత్రిక విద్యాపీఠం సప్లిమెంటరీ పరీక్షలు శనివారం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పదవ తరగతికి 293 మంది, ఇంటర్‌కు 1,428 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో పదవ తరగతికి మూడు, ఇంటర్‌కు ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదవ తరగతి పరీక్షలకు 546, ఇంటర్ పరీక్షలకు 1,136 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కాకినాడ జిల్లాలో పదవ తరగతికి మూడు, ఇంటర్‌కు నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు 842, ఇంటర్‌కు 1,495 మంది హాజరు కానున్నారు. ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా నిర్వహించనున్న పదవ తరగతి, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా, గుర్తించిన పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ప్రాధాన్యమిస్తున్నట్టు ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కన్వీనర్ పి.సాయివెంకటరమణ తెలిపారు. ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన నియామకాలను చేపట్టారు.

పరీక్షల టైమ్ టేబుల్

తేదీ	10వ తరగతి	ఇంటర్
జూన్1	తెలుగు, ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళం	హిందీ, తెలుగు, ఉర్దూ
జూన్3	హిందీ	జీవశాస్త్రం, వాణిజ్య/ వ్యాపార శాస్త్రం,గృహ విజ్ఞాన శాస్త్రం
జూన్5	ఇంగ్లిష్	ఇంగ్లిష్
జూన్6	గణితం, భారతీయ సంస్కృతి,వారసత్వం	గణితం, చరిత్ర, వ్యాపార గణక శాస్త్రం
జూన్7	శాస్త్ర,సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞానశాస్త్రం	ఫిజిక్స్, సివిక్స్, మనో విజ్ఞాన శాస్త్రం
జూన్8	సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం	కెమిస్ట్రీ, ఎకానమిక్స్, సామాజిక శాస్త్రం

పరీక్షలు ప్రతి రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఇంటర్మీడిచట్ ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్

- ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు
- నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో ఘటన

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం శివారులో బైక్ అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన కొండా ప్రవీణ్, గెల్లా దిలీప్, సిర్రా నిరీక్షణ్ అనే యువకులు సింగవరం గ్రామంలో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరకు వచ్చి శుక్రవారం సాయంత్రం బైక్‌పై ఇంటికి వెళుతున్నారు. బైక్‌పై వేగంగా వెళుతున్న ముగ్గురు యువకులు సమిశ్రగూడెం శివారులో అదుపు తప్పి పడిపోతూ అదే సమయంలో తాడేపల్లిగూడెం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సుని ఢీకొట్టారు. దీంతో గెల్లా దిలీప్ తలకు తీవ్ర గాయాలు కాగా, ప్రవీణ్, నీరిక్షణ్‌లకు శరీరంలోని వివిధ భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి రాజమహేంద్రవం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్సై రమేష్ పరిశీలించి ప్రమాద వివరాలు నమోదు చేసుకున్నారు.


సమిశ్రగూడెం శివారులో జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలతో యువకులు